క్లుప్తంగా

ఆక్రమణల పరిశీలన



ఆక్రమణదారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ మధుసూదన్

నరుబుజ్జిలి: ప్రభుత్వ స్థలాల్లో అక్రమంగా నిర్మించిన కట్టడాలను సెప్టెంబర్ 2వ తేదీ లోగా తొలగించకపోతే, ప్రభుత్వ యంత్రాంగమే స్వయంగా దగ్గర ఉండి తొలిగించనుందని తహసీల్దార్ ఎల్.మధుసూదన్ ఆక్రమణదారులకు స్పష్టం చేశారు. అక్రమ కట్టడాల ప్రదేశాలను శనివారం పరిశీలించారు. అలికాం-బత్తిలి, జేఎస్ రోడ్లు పక్కన ప్రభుత్వ స్థలంలో అక్రమంగా నిర్మించిన కట్టడాలను తొలగించేందుకు 131 మందికి ఇటీవల నోటీసులు జారీ చేశారు. మీరు నిర్మించిన కట్టడాల్లో ఉన్న సామగ్రిని గడువులోగా తరలించాలన్నారు. లేకపోతే విలువైన వస్తువుల పాడవుతాయని, దానికి మేము బాధ్యులం కాదన్నారు. ఆర్అండ్బీ జేఈ ఆంజనేయనాయక్, ఆర్ఐ బాబూరావు, వీఆర్వో సుజాత పాల్గొన్నారు.

రావాడకు మదర్ థెరీసా గోల్డెన్ అవార్డు



అవార్డు అందుకుంటున్న రావాడ వెంకటరావు

నరుబుజ్జిలి: సంఘ సేవకురాలు మదర్ థెరీసా పేరుపై ఉన్న గోల్డెన్ అవార్డు బురిడివల గ్రామానికి చెందిన జాతీయ మానవ హక్కుల సంఘం సభ్యుడు రావాడ వెంకటరావుకు వరించింది. ఆగస్టు 26న తెలంగాణా రాష్ట్ర రాజధాని హైదరాబాద్లోని రవీంద్రభారతి ఆడిటోరియంలో ద న్యూలైఫ్ థియోలాజికల్ యూనివర్సిటీ వారు మదర్ థెరీసా జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో అవార్డు అందజేశారు. అవార్డు దక్కడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు.

నీలమణిదుర్గ సన్నిధిలో ఏఎస్పీ ప్రేమ్కాజల్



ఏఎస్పీ ప్రేమ్కాజల్కు జ్ఞాపికను అందజేస్తున్న ఆలయ సిబ్బంది

పాతపట్నం: ఉత్కళాంధ్రుల ఆరాధ్య దైవం నీలమణిదుర్గ అమ్మవారిని జిల్లా అడిషనల్ ఎస్పీ ప్రేమ్కాజల్ శనివారం దర్శించుకున్నారు. అమ్మవారికి కుంకుమ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమెకు అర్చకులు ఆశీర్వాదాలు అందజేశారు. ఆలయ మర్యాదలతో ఆహ్వానించారు. ఏఎస్పీకి అమ్మవారి జ్ఞాపికను అందజేశారు. ఎస్ఐ బి.లావణ్య, ఆలయ గుమస్తా సుదర్శనరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యావసరాల ధరలు తగ్గించాలి



సింహాచలం

హిరమండలం: నిత్యావసరాల ధరలు తగ్గించి, ప్రజాపంపిణీ వ్యవస్థను పటిష్ట పరచాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కార్యవర్గ సభ్యుడు జి.సింహాచలం శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రోజురోజుకూ నిత్యవసర వస్తువుల ధరలు చుక్కలను అంటుతున్నాయన్నారు. బియ్యం, పప్పులు, చింతపండు, ఉల్లి వంటి నిత్యావసర వస్తువులతో పాటు కూరగాయల ధరలు అధికంగా ఉన్నాయన్నారు. సామాన్యులు, మధ్య తరగతి ప్రజలకు అందనంత ఎత్తులో నిత్యవసర వస్తువుల ధరలు ఉంటే, వారు ఏ విధంగా జీవనం సాగించగలని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు.

అంగన్వాడీ ఆయా మృతికి సంతాపం



శార్వాణమ్మ (ఫైల్)

ఎల్.ఎన్.పేట: మండలంలోని పూశాం గ్రామంలోని అంగన్వాడీ ఆయాగా పనిచేస్తున్న యారబాటి శార్వాణమ్మ (35) శనివారం మృతి చెందారు. గత కొద్ది రోజులుగా ఆనారోగ్యంతో బాధపడుతున్న ఆమెను కుటుంబ సభ్యులు పలు ఆస్పత్రుల్లో వైద్యం అందించారు. అంగన్డీ కేంద్రంలో విధులు ముగించుకుని శుక్రవారం సాయంత్రం ఇంటికి వెళ్లిన ఆమె అస్వస్థతకు గురైంది. వెంటనే కుటుంబ సభ్యులు శ్రీకాకుళంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందిందని భర్త జగ్గునాయుడు తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయా మృతి పట్ల కొత్తూరు ఐసీడీఎస్ సీడీపీఓ విమలకుమారి, అంగన్వాడీ సూపర్వైజర్లు నవభారతి, జ్యోతిలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు సంతాపం తెలిపారు.

రహదారిపైనే పశువులు

- రాత్రి సమయంలో ప్రమాదాలకు గురవుతున్న ద్విచక్ర వాహనదారులు



ఓ షాపింగ్ మాల్ ఎదురుగా రోడ్డుపై ఉన్న ఆవులు

నియోజకవర్గ కేంద్రం నరసన్నపేటలో రాత్రి అయితే పశువులు రహదారులపైకి చేరుకుంటున్నాయి. రోడ్లే పశువుల శాలలుగా మారాయి. మెయిన్ రోడ్డులోని ప్రధాన కూడళ్ల వద్ద పశువులు రాత్రి సమయంలో సంచరిస్తూ.. నిద్రిస్తున్నాయి. వీధి దీపాలు సక్రమంగా వెలగకపోవడంతో రాత్రి సమయంలో పశువులు కనిపించడంలేదు. ద్విచక్ర వాహనదారులు పశువులను తప్పించబోయి ప్రమాదాలకు గురవుతున్నారు. స్థానిక పాడి రైతులు తమ అవసరాల తరువాత పశువులను వీధుల్లోకి వదిలేస్తుండటంతో ఈ పరిస్థితి నెలకొంటుంది. వీధుల్లో చెత్త, కాగితాలు తింటూ తిరుగుతున్నాయి. రోడ్లపై రాత్రి సమయంలో తిరుగుతున్న పశువులను నియంత్రించాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

- నరసన్నపేట



కాలేజ్ రోడ్డులో రాత్రి సమయంలో పశువుల సంచారం



వైఎస్సార్ కూడలి వద్ద రోడ్డుపై తిరుగుతున్న ఆవులు



పాతబస్టాండ్లోని ఉమామహేశ్వరాలయం ఎదురు రోడ్డుపై ఉన్న ఆవులు

చెన్నాపురంలో ఇంటింటా ఫీవర్ సర్వే



సర్వే నిర్వహిస్తున్న సైరిగాం పీహెచ్సీ సిబ్బంది

నరసన్నపేట: మండలంలోని చెన్నాపురంలో సైరిగాం పీహెచ్సీ సిబ్బంది శనివారం ఇంటింటా సర్వే చేపట్టారు. జ్వరం తగ్గి వళ్లు నొప్పులతో 60 మందికి పైగా ఉండగా.. జ్వరంతో బాధపడుతున్న వారు 10 మంది ఉన్నారు. శనివారం కొత్తగా జ్వరంతో బాధపడుతున్నవారు ఇద్దరిని గుర్తించారు. పీహెచ్సీ వైద్యుడు గురునాథ్ మాట్లాడుతూ గ్రామంలో ప్రస్తుతానికి జ్వరాలు అదుపులోనే ఉన్నాయన్నారు. వైరల్ జ్వరాలు తగ్గి కీళ్లు, వళ్లు నొప్పులతో బాధపడుతున్నవారు అధికంగా ఉన్నారన్నారు. వీరు విశ్రాంతి తీసుకొని ఆహార నియమాలు పాటిస్తే నొప్పులు తగ్గుతాయన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. జ్వరాలు వస్తే ఆందోళన చెందిన ప్రైవేట్ వైద్యులను ఆశ్రయించవద్దని సూచించారు. గ్రామంలో ఉన్న ఏఎన్ఎం, ఆశ వర్కర్లకు సమాచారం ఇస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

జ్వరాల వ్యాప్తిని అరికట్టాలి



మెడికల్ అధికారి లక్ష్మీప్రసన్నతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణ మూర్తి

జలుమూరు: గత మూడు రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో జ్వరాలు ఎక్కువగా వ్యాప్తి చెందుతున్నాయని, వీటి అదుపునకు వైద్య సిబ్బంది చర్యలు తీసుకోవాలని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. అచ్చుతాపురం పీహెచ్సీని శనివారం సందర్శించి రికార్డులు పరిశీలించారు. రోజువారీ ఓపీ ఎంత ఉంటుందని అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది హాజరుపట్టి పరిశీలించి సమయపాలన పాటించాలని సూచించారు. ఆస్పత్రిలో ఉన్న సమస్యలను వైద్యాధికారి లక్ష్మీప్రసన్నను అడిగి తెలుసుకున్నారు. మీటింగ్హాల్, ల్యాబ్ను విస్తరించాల్సి ఉందని ఆమె వివరించారు. ఈ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. టీడీపీ నాయకులు ఉన్నారు.

జీఓ 117ను రద్దు చేయాలని వినతి



ఎమ్మెల్యే రమణమూర్తికి వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

నరసన్నపేట: విద్యా శాఖలో అమలులో ఉన్న జీఓ నంబర్ 117ను రద్దు చేస్తామని ఎన్నికల సందర్భంగా కూటమి నాయకులు హామీ ఇచ్చారని, దీనిని వెంటనే అమలు చేయాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తికి స్థానిక యూటీఎఫ్ నాయకులు శనివారం వినతిపత్రమిచ్చారు. అధికారం వచ్చి నెలలు కావస్తున్నా జీఓ అమలు కొనసాగుతోందని యూటీఎఫ్ నాయకులు బమ్మిడి శ్రీరామ్మూర్తి, కె.వైకుంఠరావు, దమయంతి అన్నారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు జీఓ 117ను రద్దు చేసేందుకు ప్రభుత్వం, విద్యా శాఖమంత్రి దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. ప్రతీ గ్రామంలో ఒకటి నుంచి ఐదు తరగతులు ఉండేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. ఉపాధ్యాయులను మెథడాలజీ పేరుతో వర్క్ అడ్జెస్ట్మెంట్ చేయడం సరికాదని, ఖాళీ స్థానాల్లో ప్రమోషన్ ద్వారా ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు ఎస్.రాజేష్, పి.ఉమాభాస్కర్, కె.ఆదినారాయణ, భూషణరావు, సునిల్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

పాతపట్నం: వెలుగు శాఖలో పనిచేస్తున్న వీఓఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ నాయకులు మహాలక్ష్మి, సూరయ్య ప్రభుత్వాన్ని కోరాన్నారు. స్థానిక వెలుగు కార్యాలయ సమావేశ మందిరంలో వీఓఏలతో శనివారం సమావేశం నిర్వహించారు. కాల పరిమితి సర్క్యులర్ రద్దుచేసి ఉద్యోగ భద్రతను కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హెచ్ఆర్ పాలసీని అమలు చేయాలన్నారు. వీఓఓల మెర్జ్ ఆపి అన్నిరకాల బకాయిలు చెల్లించాలన్నారు. 15 సంఘాలు లోపు ఉన్న వీఓఏలకు వేతనాలు చెల్లించాలన్నారు. వయస్సు, చదువు, జెండర్ పేరుతో తొలగింపులు ఆపాలన్నారు. లోకో యాఫ్ వర్కు కోసం 5జీ మొబైల్ను ప్రభుత్వమే ఇవ్వాలన్నారు.

పరామర్శ..



ఆమదాలవలస: బోర చిన్నంనాయుడు కుటుంబాన్ని పరామర్శిస్తున్న తమ్మినేని సీతారాం



జలుమూరు: కొర్ను సత్యం కుటుంబాన్ని పరామర్శిస్తున్న ధర్మాన కృష్ణదాస్

జలుమూరు: మండల పరిధిలోని యలమంచిలి గ్రామానికి చెందిన కొర్ను సత్యం కుమారుడు రాము ఇటీవల మృతి చెందారు. సత్యం కుటుంబాన్ని మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ శనివారం పరామర్శించారు. పరామర్శించిన వారిలో ఎంపీపీ వాన గోపి, పార్టీ మండల అధ్యక్షుడు కనుసు సీతారాం, సచివాలయ కన్వీనర్ ధర్మాన జగన్, జలుమూరు, పోలాకి మండల సలహాదారులు పైడి విఠల్రావు, ముద్దాడ బైరాగినాయుడు, సర్పంచ్లు దామ మన్మథరావు, మెండ రవికుమార్, రామూర్తి నాయుడు, పార్టీ నాయకులు బోర రామకృష్ణ, ఆదినారాయణ, జోగారావు తదితరులు ఉన్నారు.

ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధిలో..

ఆమదాలవలస: మున్సిపాలిటీ పరిధిలోని చింతాడ గ్రామంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బోర చిన్నంనాయుడు మాతృమూర్తి ఇటీవల మృతి చెందారు. ఆ కుటుంబాన్ని మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం శనివారం పరామర్శించారు. కృష్ణాపురం గ్రామానికి చెందిన కూన ఉపేంద్ర ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. ఆ కుటుంబాన్ని తమ్మినేని పరామర్శించారు. పరామర్శించిన వారిలో మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్కుమార్, మాజీ వైస్ ఫ్లోర్ లీడర్ అల్లంశెట్టి ఉమహేశ్వరరావు, వైఎస్సార్సీపీ నాయకుడు పొన్నాడ చిన్నారావు, కార్యకర్తలు ఉన్నారు.

ఖాదీ పరిశ్రమలో శిక్షణ

పొందూరు: పొందూరు ఖాదీని పది కాలాలపాటు బతికించేందుకు ఖాదీ, చేనేత కుటుంబాలకు చెందిన యువతీ, యువకులకు శిక్షణ ఇచ్చేందుకు నమూనా సర్వే నిర్వహిస్తున్నట్లు లీడర్ పీపుల్స్ సర్వీస్ సంస్థ నిర్వాహకులు వీవీ రమణమూర్తి తెలిపారు. ఈ మేరకు శనివారం ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. మొత్తం 25 మందికి శిక్షణ ఇచ్చి ఆకర్షణీయమైన స్టయిఫండ్ చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాలిన్న సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు సెల్ 9490528730ను సంప్రదించాలన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓలు

నరసన్నపేట: మండలంలలోని గొట్టిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలను ఎంఈఓలు శాంతారావు, దాలినాయుడు శనివారం తనిఖీ చేశారు. ప్రస్తుతం వాతావరణంలో వచ్చే మార్పులతో పిల్లలు ఆనారోగ్యానికి గురి అవుతున్నారని, దీనిని దృష్టిలో పెట్టుకొని స్కూళ్లలో మధ్యాహ్న భోజనం వేడిది పెట్టాలని సూచించారు. అనంతరం ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

శిథిలావస్థలో మంచినీటి ట్యాంక్



కూలేందుకు సిద్ధంగా ఉన్న మంచినీటి పథకం ట్యాంక్

సారవకోట: మండలంలోని చీడిపూడి గ్రామంలో ఉన్న రక్షిత మంచినీటి పథకం ట్యాంక్ శిథిలావస్థకు చేరుకుంది. అవలింగి, బుడితి, చీడిపూడి గ్రామాలకు తాగునీరు సరఫరా చేసేందుకు కొన్ని దశాబ్దాల క్రితం ఈ ట్యాంక్ నిర్మించారు. ట్యాంక్ను క్లోరినేషన్ చేసేందుకు మెట్లు ఏర్పాటు చేశారు. ఆ మెట్లు కూడా పూర్తిగా పాడవడంతో క్లోరినేషన్ చేసే దాఖలాలు కూడా కన్పించడం లేదు.

● పేరుకుపోయిన గుర్రపుడెక్క



పోలాకి ఓపెన్ హెడ్ చానల్లో బడ్డవానిపేట వద్ద పేరుకుపోయిన గుర్రపు డెక్క

వంశధార కాలువలతోపాటు ఓపెన్ హెడ్ చానళ్లలో గుర్రపు డెక్క పేరుకుపోవడంతో సాగునీటిని అవస్థలు తప్పడం లేదు. నరసన్నపేట మండలం పరిధిలోని పోలాకి ఓపెన్ హెడ్ చానల్, నడగాం వంశధార చానల్లో గుర్రపు డెక్క అధికంగా ఉంది. జులైలో కాలువల్లో గుర్రపు డెక్క తొలగించినా మొక్కుబడిగా పనులు చేపట్టడంతో ఇప్పుడు రైతులకు కష్టాలు తప్పడం లేదు. బోడవరం కూడలి నుంచి బడ్డవానిపేట వరకు పోలాకి ఓపెన్ హెడ్ చానల్లో గుర్రపు డెక్క అధికంగా పేరుకుపోయింది. నీటి సరఫరా పూర్తిస్థాయిలో జరగడం లేదు. నడగాం వంశధార చానల్లో కూడా ఇదే పరిస్థితి. రైతులు సాగునీటికి ఇబ్బంది పడుతున్నారు. వంశధార ఇంజినీర్లు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. - నరసన్నపేట

డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం



నరసన్నపేట: పాతబస్టాండ్లో రోడ్డుపై నుంచి వెళ్తున్న వర్షం నీరు



నరసన్నపేట: కొత్తబస్టాండ్ ఎదురుగా ఉన్న రోడ్డు పైనుంచి ప్రవహిస్తున్న వర్షం నీరు

నరసన్నపేట: పట్టణంలోని పల్లిపేట నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న డ్రైన్లు అలంకార ప్రాయంగామారాయి. వర్షం నీటితో పాటు మురుగునీరు డ్రైన్ల ద్వారా వెళ్లడం లేదు. చిన్న వర్షం పడినా మెయిన్ రోడ్డుపై నుంచి వర్షం నీరు ప్రవహిస్తోంది. రోడ్లే డ్రైనేజీల్లా మారాయి. రోడ్డు మార్జిన్లు పూర్తిగా ఆక్రమణలకు గురికావడం, ఆర్అండ్బీ శాఖ నిర్మించిన డ్రైన్లపై వ్యాపారులు తమ అవసరాలకు అనుగుణంగా నిర్మాణాలు చేపట్టమేనని దీనికి కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మెయిన్ రోడ్డు డ్రైన్లా మారింది. రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలు తొలగించాలని, రోడ్డు మార్జిన్లు యథావిధిగా ఉండేలా పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్లన్నీ జలమయం..



ఆమదాలవలస: పూజారిపేటలో నిలిచిన వర్షం నీరు

ఆమదాలవలస: ఎడతెరిపి లేకుండా గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పురపాలక సంఘ పరిధిలోని పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. శనివారం ఉదయం పూజారిపేట, పాతినవారివీధి, కండ్రపేట, సాయినగర్, బి.ఆర్.నగర్, మెట్టక్కివలస తదితర ప్రాంతాల్లో రోడ్లపై నీరు నిలిచి చెరువులను తలపిస్తున్నాయి. రోడ్లపై నీరునిలిచి పోవడంతో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు.

లోక్ అదాలత్ను సద్వినియోగం చేసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న సివిల్ జడ్జి హరిప్రియ

నరసన్నపేట: జాతీయ లోక్ అదాలత్ను సెప్టెంబర్ 14న నిర్వహించనున్నామని, దీంట్లో ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా ప్రయత్నించాలని స్థానిక ప్రిన్సిపల్ సివిల్ జడ్జి సి.హరిప్రియ అన్నారు. స్థానిక కోర్టులో పోలీసు అధికారులు, న్యాయవాదులతో శనివారం సమీక్ష నిర్వహించారు. ప్రధానంగా క్రిమినల్ కేసులు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచించారు. కేసులు రాజీ చేసుకుంటే కక్షిదారులకు ఎంతో సమయం ఆదా అవుతుందని, వారికి తగిన న్యాయం జరుగుతుందన్నారు. కోర్టు పరిధిలో ఉన్న నరసన్నపేట, పోలాకి మండలాల్లో పెండింగ్లో ఉన్న కేసులు పరిష్కారమయ్యేలా పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం స్థానిక సబ్జైల్ను సందర్శించి ఖైదీలతో మాట్లాడారు. అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

పారిశుద్ధ్య లోపంతో జ్వరాలు



బజారు వీధిలో కప్పేసిన కాలువ



వ్యాపారులకు నోటీసులు జారీ చేస్తున్న పంచాయతీ అధికారులు

జలుమూరు: శ్రీముఖలింగంలో పారిశుద్ధ్య లోపం వల్లనే జ్వరాలు ప్రబలాయని అధికారులు తేల్చారు. శనివారం పంచాయతీ విస్తరణ అధికారి ఉమామహేశ్వరరావు, మెడికల్ అధికారి పూజారి సుజాత, కార్యదర్శి జమునలు మరోసారి పారిశుద్ధ్యంపై గ్రామస్తులకు ఇంటింటా అవగాహన కల్పించి మాట్లాడారు. ప్రధానంగా బజారు వీధి మొత్తం కాలువ కప్పేయడంతో నీరు నిల్వ ఉండి పోయి వర్షం నీరు పొందర వీధి లోపలకు వెళ్లిపోతోంది. దీంతో దోమలు పెరిగి అంటురోగాలు ప్రబలుతున్నాయని వైద్యసిబ్బంది వివరించారు. శ్రీముఖలింగం సచివాలయం నుంచి బజారు వీధి కలుపుకొని గ్రామ శివారు వరకూ కాలవ ఉండేది. ఈ కాలువ గుండా వర్షం నీరు, గ్రామం వాడుక నీరు అంతా గ్రామ శివారులో ఉన్న బందలోకి చేరేది. కానీ ఆ కాలువను ఆక్రమణలతో కప్పేయడంతో నీరు ఎక్కడికక్కడ నిల్వ ఉండిపోతోంది. వీటిని గమనించి పంచాయతీ విస్తరణ అధికారి ఉమా మహేశ్వరరావు 18 మంది వ్యాపారులకు నోటీసులు జారీ చేశారు. మూడు రోజుల్లో కాలువ పూర్వస్థితిలో ఉండేలా మూత వేసిన పలకలు, సిమెంట్ పూతలు అన్నీ తీయాలని ఆదేశించారు.

అదుపులోకి జ్వరాలు

శ్రీముఖలింగంలో జ్వరాలు అదుపులోకి వచ్చాయని అచ్యుతాపురం పీహెచ్సీ మెడికల్ అధికారి పూజారి సుజాత అన్నారు. శనివారం శ్రీముఖలింగంలో ఇంటింటా సర్వే నిర్వహించగా జ్వరాలు ఉన్న కేసులు నమోదు కాలేదన్నారు. జ్వర బాధితుల్లో ఎవరికీ ప్లేట్లెట్లు తగ్గలేదన్నారు. మరో నాలుగైదు రోజులు వరకూ మెడికల్ క్యాంప్లు ఉంటాయన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్కలు నాటుతున్న పీఓ, అంగన్వాడీ సిబ్బంది

పాతపట్నం: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని ఐసీడీస్ సీడీపీఓ టి.విమలారాణి అన్నారు. స్థానిక అంగన్వాడీ కేంద్రం వద్ద శనివారం మొక్కలు నాటారు. పీఓ మాట్లాడుతూ ×తల్లిపేరు మీద ఒక మొక్క నాటే కార్యక్రమం ద్వారా ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అన్ని అంగన్వాడీ కేంద్రాల వద్ద మొక్కలు నాటడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు డి.అమరావతి, జి.అనురాధ, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

తీరప్రాంత గ్రామాల్లో అప్రమత్తం



కొత్తరేవులో ప్రజలతో మాట్లాడుతున్న అధికారులు



డీఎల్పురం వద్ద ముంపు పొలాలను పరిశీలిస్తున్న ఏఓ చిరంజీవి

పోలాకి: గత రెండు రోజులుగా వర్షాలు ఎడతెరిపి లేకుండా కురుస్తున్నాయి. పలు గ్రామాల్లో శనివారం అధికారులు పర్యటించారు. తహసీల్దార్ సురేష్కుమార్, ఎస్ఐ రంజిత్ సముద్ర తీరప్రాంత గ్రామాల్లో పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు. మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని సూచించారు. శిథిల భవనాల్లో నివాసం ఉండవద్దన్నారు. వ్యవసాయశాఖ అధికారి చిరంజీవి ముంపునకు గురైన పలు ప్రాంతాలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి ముంపు తీసిన తరువాత చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను వివరించారు.